నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
8 | శుక్రవారం 25 ఏప్రిల్ 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



రెబ్బెనలో బీఆర్ఎస్ చలో వరంగల్ పోస్టర్లను విడుదల చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# రజతోత్సవ సభను జయప్రదం చేయాలి

**ఊరూరా బీఆర్ఎస్ శ్రేణుల విస్తృత ప్రచారం**

బెజ్జూర్, ఏప్రిల్ 24 : ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని బీఆర్ఎస్ శ్రేణులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఊరూరా విస్తృతంగా ప్రచారం చేశారు. గురువారం బెజ్జూర్ మండలం ముంజంపల్లి, మర్తిడి, పోతెపల్లిలో చలో వరంగల్ పోస్టర్లను అతికించారు. ప్రధాన చౌరస్తాల్లో కేసీఆర్.. కేటీఆర్.. ఆర్ఎస్పీ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బూస పారయ్య, యూత్ అధ్యక్షుడు దుర్గం తిరుపతి, సీనియర్ నాయకులు ఖాజా మోహినుద్దీన్, ఖాజా సమీయుద్దీన్, నాయకులు ఫసిఉల్లాఖాన్, బర్త దేవయ్య, హరీశ్, షంషోద్దీన్ బాబు పాల్గొన్నారు.

**రెబ్బెనలో చలో వరంగల్ పోస్టర్స్ విడుదల**

రెబ్బెన, ఏప్రిల్ 24: రెబ్బెన మండల కేంద్రంలో గురువారం చలో వరంగల్ పోస్టర్స్‌ను విడుదల చేసినట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, వైస్ చైర్మన్ రంగు మహేశ్‌గౌడ్, బీఆర్ఎస్ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి కుందారపు శంకరమ్మ, పట్టణ అధ్యక్షుడు అశోక్, మాజీ జడ్పీటీసీ అజ్మీర బాబురావు, మాజీ వైస్ ఎంపీపీ గజ్జల సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ సంగం శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ బోమ్మినేని శ్రీధర్, మాజీ డైరెక్టర్ పల్లె రాజేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్‌లు బోమ్మినేని అహల్యాదేవి, తోట లక్ష్మణ్, భీమేశ్, ఓరగంటి మల్లేశ్, శ్రీనివాస్, మాజీ కో ఆప్షన్ మెంబర్ జౌరొద్దీన్, నాయకులు మన్యం పద్మ, వరలక్ష్మి, జుమ్మిడి ఆనందరావు, తక్కలపల్లి రాజేశ్వర్‌రావు, దుర్గరావు, పందిర్ల మధునయ్య, దుర్గం భరద్వాజ్, ఉబెదుల్లా, అప్పు, భుజంగరావు, గోగర్ల రాజేశ్, స్వామి, శ్రీకాంత్, ప్రభాకర్ ఉన్నారు.




మందమర్రిరూరల్ : వాల్ రైటింగ్ చేస్తున్న నాయకులు

**వాడ వాడలా వాల్‌రైటింగ్స్**

మందమర్రిరూరల్, ఏప్రిల్ 24 : మండలంలోని గ్రామ గ్రామాన, వాడ వాడలా బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు సంబంధించి వాల్ రైటింగ్స్ నిర్వహించారు. బీఆర్ఎస్ చెన్నూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రాజారమేశ్ ఆధ్వర్యంలో కొటేషన్‌లతో కూడిన వాల్ రైటింగ్స్ చేశారు.



బెజ్జూర్ : ముంజంపల్లిలో చలో వరంగల్ సభ పోస్టర్లతో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


# ఉగ్రవాదులను ఉరితీయాలి

**● మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ● పహల్గాం అమరులకు ఘన నివాళి.. కొవ్వొత్తుల ర్యాలీ**

మంచిర్యాలటౌన్, ఏప్రిల్ 24: పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని నిరసిస్తూ గురువారం సాయంత్రం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంచిర్యాలలో కొవ్వొత్తులతో ర్యాలీ తీశారు. పట్టణంలోని ముఖరాం చౌరస్తా నుంచి గాంధీ పార్కు వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం మృతులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ 26 మంది పర్యాటకులను పొట్టనబెట్టుకున్న ఉగ్రవాదులను పట్టుకొని ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదాన్ని అణచివేయడానికి కేంద్రంతోపాటు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు విజిత్‌రావు, నాయకులు పల్లె భూమేశ్, గాదెసత్యం, అంకం నరేశ్, తోట తిరుపతి, సందెల వెంకటేశ్, జూపాక సుధీర్, గట్టయ్య, అక్కూరి సుబ్బయ్య, మొగిలి శ్రీనివాస్, వంగ తిరుపతి, కాటం రాజు, సుంకరి రమేశ్, తాజుద్దీన్ పాల్గొన్నారు.



మంచిర్యాలలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు



భానుడి ప్రతాపానికి నిర్మానుష్యంగా మారిన మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా

**జిల్లాల వారీగా ఉష్ణోగ్రత(డిగ్రీల సెల్సియస్)**

| మంచిర్యాల(భీమిని) | ఆసిఫాబాద్(తిర్యాణి) | ఆదిలాబాద్(తాంసి) | నిర్మల్ (కుభీర్) |
|---|---|---|---|
| 45.0 | 44.9 | 45.2 | 45.2 |

# భానుడి ఉగ్రరూపం

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో దంచికొడుతున్న ఎండలు**

- రోజు రోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- గురువారం గరిష్ఠంగా 45.2 డిగ్రీలు నమోదు
- ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు

మంచిర్యాల, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎండలు దంచికొడుతున్నాయి. భానుడు ఉగ్రరూపం దాల్చడంతో రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఉదయం ఎనిమిదింటి నుంచే సూర్యుడు నిప్పులు కురిపిస్తుండగా, సాయంత్రం ఏడింటి దాకా వేడిమి ఉంటుంది. గురువారం ఆదిలాబాద్‌లో గరిష్ఠంగా 45.2 డిగ్రీలు, నిర్మల్‌లో 45.2, మంచిర్యాలలో 45.0, కుమ్రం భీం ఆసిఫాబాద్ 44.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రజలు వడగాలులు.. ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి కావాల్సి వచ్చింది. మధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారి అప్రకటిత కర్ఫ్యూను తలపించింది. కొందరు తప్పనిసరి పరిస్థితుల్లో జాగ్రత్తలు పాటిస్తూ ప్రయాణం సాగించాల్సి వచ్చింది. ఇక ప్రస్తుతం పెండ్లిళ్ల సీజన్ కాగా, దగ్గరి బంధువులు తప్ప ఎవరూ వెళ్లడం లేదు. వివాహ వేదికలు వెలవెలబోతున్నాయి. ప్రజలు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు కూలర్లు.. ఏసీలను విపరీతంగా వినియోగిస్తున్నారు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే మే.. నెలలో సూర్య ప్రతాపం ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు.



భానుడి ప్రతాపానికి వెలవెలబోతున్న మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారి

**జాగ్రత్తగా ఉండాలి**



ఎండలు ముదిరాయి. వడగాల్పులు వీస్తున్నాయి. ఎండలో ఎక్కువ సమయం గడిపేవారు వడదెబ్బ బారినపడకుండా కనీస జాగ్రత్తలు తీసుకోవాలి. నూలు దుస్తులు ధరించాలి. బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగును ఉపయోగించాలి. ఎక్కువ సమయం నీడ ప్రదేశాల్లో ఉండేలా చూసుకోవాలి. మజ్జిగ, ఓఆర్ఎస్ తీసుకుంటే వడదెబ్బ భారీ నుంచి తప్పించుకునే అవకాశం ఉంది. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని వైద్యశాలకు వెళ్లాలి.

*- డాక్టర్ సత్యనారాయణ, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ చెన్నూర్*



మంచిర్యాలలో ఎండలో పని చేస్తున్న కూలీలు..

# వడదెబ్బతో నలుగురి మృతి



సోఫిబేగ్ (ఫైల్)



రాసమల్ల భూదేవి (ఫైల్)



లోంకర్ ప్రభాకర్ (ఫైల్)

జైనూర్/పెంచికల్‌పేట్/జన్నారం/నిర్మల్ అర్బన్,ఏప్రిల్ 24 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వడదెబ్బతో నలుగురు మృత్యువాత పడ్డారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం మార్లవాయి గ్రామానికి చెందిన కనక కాశీరాం (42) సీఆర్‌టీగా జొడేఘాట్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం విధులు ముగించుకొని స్వగ్రామమైన మార్లవాయికి వచ్చాడు. కాసేపటికే తీవ్ర అస్వస్థతతో మృతి చెందాడు. పెంచికల్‌పేట్ మండలం ఎల్కపల్లి గ్రామానికి చెందిన లోంకర్ ప్రభాకర్ (24) బుధవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో దహెగాంలో ఉన్న తన అక్క ఇంటికి వెళ్లాడు. అక్కడ పొలం పనులు చేస్తుండగా, ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఆటోలో దవాఖానకు తరలిస్తుండగా, మార్గం మధ్యలో మృతి చెందాడు. ఇక మంచిర్యాల జిల్లా జన్నారం మండలం తొమ్మిదిగుడిసెల పల్లెకు రాసమల్ల భూదేవి(60) బుధవారం కూలీ పనికి వెళ్లింది. సాయంత్రం ఇంటికి తిరిగి రాగా, అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గురువారం తెల్లావారు జామున మృతి చెందినట్లు ఆమె కుమారుడు రాసమల్ల స్వామి తెలిపారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని బ్రహ్మపురికాలనీకి చెందిన మహ్మద్ బేగ్ కుమారుడైన సోఫిబేగ్ (25) గురువారం వడదెబ్బతో మృతి చెందాడు. సోఫిబేగ్ మూడు నెలల క్రితమే దుబాయ్ నుంచి నిర్మల్‌కు వచ్చాడు.

# నిప్పుల కొలిమిలా కోల్ బెల్ట్

**● ఓసీపీల్లో విలవిల్లాడుతున్న కార్మికులు ● విధుల సమయాలు మార్చాలని డిమాండ్**

శ్రీరాంపూర్, ఏప్రిల్ 24 : భానుడి భగభగలతో కోల్‌బెల్ట్ ప్రాంతం నిప్పుల కొలిమిలా మారింది. శ్రీరాంపూర్, బెల్లంపల్లి, మందమర్రి ఏరియాలతో పాటు జైపూర్ విద్యుత్ కేంద్రం, సిరామిక్స్, సిమెంట్ పరిశ్రమల ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఉపరితల గనుల్లో బొగ్గును వెలికి తీయడానికి ప్రతిరోజూ టన్నుల కొద్దీ పేలుడు పదార్థాలు వినియోగిస్తుంటారు. ఫలితంగా గాలి వేడెక్కుతుంది. ఇక్కడ సాధారణం కన్నా ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఆయా ప్రాంతాల్లో నిల్వ చేసే బొగ్గు ప్రభావం కూడా వాతావరణంపై పడుతుంది. ఇక గనుల్లో పనిచేసే కార్మికులు వేడిమికి తట్టుకోలేక విలవిల్లాడుతున్నారు. విధులు నిర్వహించలేని పరిస్థితి ఉందని, విధుల సమయాలు మార్చాలని డిమాండ్ చేస్తున్నారు.



నిర్మానుష్యంగా శ్రీరాంపూర్ ఓసీపీ క్వారీ

# రాంచెరువు మత్తడి కాలువపై స్లాబులు

**● మంచిర్యాలలో ఇష్టారాజ్యంగా నిర్మాణాలు ● చోద్యం చూస్తున్న అధికారులు**



రాళ్లపేట తెలంగాణ తల్లి విగ్రహం సమీపంలో కాలువపై నిర్మించిన స్లాబు



రెడ్డికాలనీలో..



జన్మభూమినగర్‌లో రాంచెరువు మత్తడి కాలువపై..

మంచిర్యాలటౌన్, ఏప్రిల్ 24 : మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇష్టారాజ్యంగా నిర్మాణాలు సాగుతున్నాయి. రాంచెరువు మత్తడి కాలువ పక్కన భవనాలు కట్టుకున్న యజమానులు.. ఏకంగా ఆ కాలువపైనే స్లాబులు నిర్మించుకొని తమ ఇళ్లకు వెళ్లేలా దర్జాగా దారులు ఏర్పాటు చేసుకుంటున్నారు. యేటా వర్షాకాలంలో జన్మభూమినగర్, హైటెక్ కాలనీల మధ్యనున్న రాంచెరువు నుంచి మత్తడి ద్వారా భారీగా వరద వెళ్తుంది. గతంలో ఈ మత్తడి ద్వారా వచ్చే వరదంతా నివాస ప్రాంతాల్లోకి వెళ్లగా, అందుకు శాశ్వత పరిష్కారంగా సుమారుగా 20 అడుగుల వెడల్పుతో రాంచెరువు నుంచి జన్మభూమినగర్, గౌతమీనగర్, ఇస్లాంపుర, రాళ్లపేట, రెడ్డికాలనీల మీదుగా రాళ్లవాగు వరకు మత్తడి కాలువ నిర్మించారు. అయితే, గౌతమీనగర్, ఇస్లాంపుర ప్రాంతాల్లో అక్కడక్కడా కాలువ వెడల్పు తగ్గింది. తాజాగా రాళ్లపేట, రెడ్డికాలనీల మధ్య పలువురు నిర్మించిన భవనాలకు ముందు ఉన్న కాలువపై స్లాబులు నిర్మిస్తున్నారు. గతంలో జన్మభూమినగర్ ఏరియాలో కమర్షియల్ బిల్డింగ్‌లకు ముందున్న కాలువపై ఎవరికి వారు వంతెనలు నిర్మించుకున్నారు. ప్రస్తుతం బైపాస్‌రోడ్డులో కాలువ పక్కనున్న స్థలాల్లో భవనాలు నిర్మించుకున్న వారు.. తమ ఇళ్లకు వెళ్లేలా ఆ కాలువపై స్లాబులు నిర్మిస్తున్నారు. పలువురు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నా అధికారులు తమకేమీ పట్టనట్లు ఉంటున్నారు. ఈ విషయాన్ని కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారి సంపత్ దృష్టికి తీసుకెళ్లగా, తమ సిబ్బందిని పంపి తగిన చర్యలు తీసుకుంటానన్నారు.

# కార్యకర్తలు అధైర్యపడవద్దు

భీమారం, ఏప్రిల్ 24 : కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, ఎవరూ అధైర్య పడవద్దని చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రాజా రమేశ్ పేర్కొన్నారు. గురువారం భీమారం మండలం బూర్గుపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువ కార్యకర్త, విద్యార్థి నాయకుడు దరావత్ శ్రీధర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా, వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. శ్రీధర్ చిత్రపటం వద్ద ఆయన తండ్రి అశోక్‌కు రూ. 2 లక్షల చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ దేశంలో ఎక్కడా లేని విధంగా కార్యకర్తలకు ఇన్సూరెన్స్ చేసిందన్నారు. ప్రతీ కార్యకర్తకు, వారి కుటుంబాలకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కలగూర రాజ్ కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దాసరి మధునయ్య, వెంకటి మేస్త్రీ, రాజ్‌కుమార్, రాజూనాయక్, గోపాల్, రాము, లక్ష్మి, నవీన్, మణిదీపక్ పాల్గొన్నారు.



శ్రీధర్ చిత్రపటం ముందు కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



న్యాయమూర్తి వీరయ్యతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

## జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 24 : మంచిర్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన ఏ.వీరయ్యను మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయస్థానంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి మొక్క అందజేశారు. అనంతరం జిల్లా స్థితిగతులపై చర్చించుకున్నారు.